క్లుప్తంగా

'కొండా'ను కలిసిన వరలక్ష్మి



జనగామ: రాష్ట్ర మంత్రిగా గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రమాణం స్వీకారం చేసిన కొండా సురేఖను రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు మచ్చా వరలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు (శుక్రవారం) సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం వారు మట్లాడుతూ కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఏకాదశి రోజైన శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వ్రతాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వ్రతాల్లో పాల్గొనే దంపతులు రూ.516 చెల్లించాలని, పూజ సామగ్రి భక్తులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్చకుడు కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేష్, వీరన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి: కొత్తగా పట్టాదారుపాసుబుక్ కలిగిన రైతులు 'రైతుబంధు' కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రాధిక తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు అప్లికేషన్ ఫాం, పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను ఇచ్చినట్లయితే రైతుబంధు పథకం వస్తుందని ఆమె తెలిపారు.

మెట్టుగుట్టపై కార్తీకమాస పూజలు

మడికొండ: 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారికి ప్రభాతసేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామాలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. సాయంకాలం హరిహరులకు ఆకాశ దీపోత్సవం, శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషు భారతి తెలిపారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పూర్ణ పుష్కలంబ సమేత అయ్యప్ప కల్యాణం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని అయ్యప్పస్వామి కల్యాణ వేడుకలను పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గురువారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు అయిన వోలు అనంతమల్లయ్య శర్మ ఆధ్వర్యంలో పూర్ణ పుష్కలంబ సమేత అయ్యప్పకు వివాహ వేడుకలు జరిపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు భారీగా తరలివచ్చి వివాహ వేడుకలను తిలకించారు. అయ్యప్పస్వాములతో పాటు భక్తులకు అన్నపూర్ణ భవనంలో భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణశర్మతో పాటు గురుస్వాములు పూజలో పాల్గొన్నారు.

మల్లన్నకు లక్షపూలతో అభిషేకం



కాజీపేట: కార్తీక మాసం చివరి గురువారం కావడంతో కాజీపేట పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తులు స్వామి వారికి లక్ష పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పుష్పాభిషేకం జరిపించారు. ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం మహిళలు దీపారాధన చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



నర్మెట: సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు



తరిగొప్పుల: సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



పాలకుర్తిలో..

నర్మెట: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన దశాబ్దకాలం అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు గురువారం అంబరాన్నంటాయి. సీఎంగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మండలకేంద్రంలోని చౌరస్తాలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి నృత్యాలు చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శులు గంగం నర్సింహారెడ్డి, భూక్య జయరాం, ఎంపీటీసీ కల్యాణం మురళి, నాయకులు శివరాత్రి మహేష్, బండి అశోక్, ప్రజ్ఞాపురం శ్రీధర్, పాతూరి కరుణాకర్‌రెడ్డి, మూల కరుణాకర్, మహేందర్, కృష్ణ, కొన్నె అంజయ్య, ప్రభుదాస్, కిషన్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: తెలంగాణ ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేపట్టిన నేపథ్యంలో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో గురువారం సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లను, స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రానున్నాయని, సంక్షేమ పథకాలతో అందరూ సుభిక్షంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తి: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్య మంత్రిగా రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడం పట్ల పాలకుర్తి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, జనార్దన్, సునీల్ తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బాణసంచా కాల్చి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, బాలకిషన్ గౌడ్, మహాత్మాచారి, రమేష్, మోహిన్‌రెడ్డి, బాలమణి, వేణువందన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

జఫర్‌గఢ్: మిచాంగ్ తుపాను వల్ల రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తుపాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలో వరి, మిర్చి, పత్తి, తదితర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వీటితో పాటు కూరగాయ పంటలు కూడా దెబ్బతిన్నాయని, కల్లాల వద్ద అరబోయిస ధాన్యం తడిసిపోవడంతో పాటు మొలకలొచ్చే పరిస్థితి నెలకొందన్నారు. పంట నష్టంపై ప్రభుత్వం వెంటనే అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

స్నేహితుడికి చేయూత

రఘునాథపల్లి: స్నేహితుడికి కష్టమొచ్చిందని తెలుసుకున్న చిన్న నాటి స్నేహితులు పరామర్శించి చేయూత అందించారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన గ్యార నాగరాజు లివర్ సమస్యతో ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్నాడు. నాగరాజు ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అంతే కాకుండా రూ.16 వేల ఆర్థికసాయం అందజేశారు. స్నేహితులు బిర్రు నాగేష్, గాజుల పాటి వీరోజి, తిప్పారపు భాస్కర్, గర్వందుల వేణు తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

రంగయ్య మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

బచ్చన్నపేట: మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చింతల రంగయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం ఆయన రంగయ్య మృత దేహంపై పార్టీ జెండా కప్పి, పూల దండ వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిద్దిపేట జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, మండల కార్యదర్శి బెల్లం కొండ వెంకటేష్, జిల్లా నాయకులు కొంగరి వెంకట్ రావు, సుంచు విజేందర్, కంత్రి ఐలయ్య, అన్నె బోయిన రాజు, బాల్‌నారాయణ, అశోక్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చల్ల ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగానే తొలి సంతకాన్ని చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఇక నుంచి సమర్థవంతమైన సురక్షితమైన పాలన రేవంత్‌రెడ్డి సమక్షంలో అందుతుందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆయన చెప్పారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



దేవరుప్పుల: పరామర్శిస్తున్న దయాకర్‌రావు



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న కడియం శ్రీహరి

దేవరుప్పుల: ధర్మపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకులు వంగాల చిరంజీవి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం పరామర్శించారు. ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో చిరంజీవి మృతదేహాన్ని చూసి దయాకర్‌రావు కంటతడి పెట్టారు. కుటుంబాన్ని ఓదార్చి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, చింత రవి, పల్ల సుందర్ రామిరెడ్డి, బసవ మల్లేశం, సుడిగల హన్మంతు, ఎల సోమ సుందర్, కృష్ణమూర్తి, అశోక్ తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం..

దేవరుప్పుల: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని కడవెండి సర్పంచ్ పోతిరెడ్డి బెల్లైన లీనారెడ్డి అన్నారు. మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన చింతకింది వెంకన్న, పైండ్ల భిక్షపతి అనారోగ్యంతో మృతి చెందగా గురువారం సర్పంచ్ వారి భౌతిక కాయాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేశారు. తాటిపెల్లి మహేష్, భిక్షపతి, పాషా, నాగేష్ ఉన్నారు.



కడవెండిలో.. సర్పంచ్ లీనారెడ్డి

నివాళి

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం ఎంపీటీసీ సభ్యురాలు గోనె సంధ్యారాణి రాజేష్ దంపతుల కుమారుడు గోనె శివతేజ (9) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ బృందంతో కలిసి తీగారం చేరుకొని బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడు మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, సొసైటీ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, ఇల్లందుల శ్రీనివాస్, సర్పంచ్‌లు గోనె జైపాల్‌రెడ్డి, తాటికాయల అశోక్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



ఇప్పగూడెంలో గుంతలమయమైన రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న గ్రామమైన ఇప్పగూడెంలో సమస్యలు తిష్ట వేసినా ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఇప్పగూడెంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న తేలిక పాటి ముసురు వానలకే రోడ్లన్నీ బురదమయంగా మారాయి. పలు కాలనీల్లో సీసీ రోడ్ల సౌకర్యం లేక మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. సీసీ రోడ్లు ఉన్న కాలనీల్లో సైతం పలు చోట్ల రోడ్లు ధ్వంసమై గుంతలుగా ఉండగా సదరు గుంతలలో నీరు నిలిచి అధ్వానంగా మారాయి. తేలికపాటి ముసురు వానలకే ప్రజలు రోడ్డు సమస్యతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పేరుకే మేజర్ పంచాయతీగా ఉండగా సమస్యల్ని మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు తమ గ్రామానికి వచ్చి పలు హామీలు చేశారని, కనీసం రోడ్ల సమస్యలైనా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీహరిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



శ్రీహరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కడియం శ్రీహరిని మండలంలోని ఇప్పగూడెం సర్పంచ్ జక్కుల పరశురాములు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గురువారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీహరికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి విషయంలో ఇప్పగూడెంపై ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరారు. నాయకులు ఎన్నకూస రాంనర్సయ్య, లింగనబోయిన శ్రీను, దైద ఎలిషన్, గొడిశాల యాదగిరి, లెనిన్, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వెంకటాద్రిపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు చల్ల రాజమహేందర్‌రెడ్డి, ముక్కెర వలేందర్‌రెడ్డి, తుప్పరి నర్సింగరావు, మహ్మద్ యాకూబ్, తుప్పరి ప్రవీణ్, నూనె మధు ఉన్నారు.

ఇదేనా విద్యుత్ ఆదా ?



గుమ్మడవెల్లిలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

లింగాలఘణపురం: గ్రామాల్లో వీధిలైట్ల విద్యుత్‌ను ఆదా చేసి బిల్లులు తగ్గిస్తామంటూ పంచాయతీ నిర్వహణ బాధ్యత నుంచి రెడ్‌కో సంస్థ తన ఆధీనంలోకి తీసుకొంది. అన్ని గ్రామాల్లో గతంలో ఉన్న విద్యుత్ బల్బులను తొలగించి కొత్తగా ఎల్‌ఈడీలను బిగించింది. ఆయా వీధులను, చౌరస్తాలను బట్టి లైట్ల ఓల్టేజీ సామర్థ్యాన్ని పెంచారు. అంతే కాకుండా వాటికి టైమర్‌లను బిగించి సాయంత్రం 6 గంటలకే వెలిగి ఉదయం ఆరు గంటలకు ఆఫ్ అయ్యే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. కానీ మండలంలోని గుమ్మడవెల్లిలో ఇలా పట్టపగలే నెల రోజులుగా వీధి లైట్లు వెలుగుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. వీధి లైట్ల నిర్వహణ బాధ్యత పంచాయతీల నుంచి తొలగించడంతో ఇక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఏమీ చేయలేకపోతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ శ్రీపాల్‌రెడ్డిని ప్రశ్నించగా లైట్ల నిర్వహణ తమ చేతుల్లో లేదని, అంతా రెడ్‌కో సంస్థకు సంబంధించిన వాళ్లే చూస్తున్నారని, నెల రోజులుగా లైట్లు వెలుగుతున్నాయని చెప్పినా స్పందన లేదన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న కాల్వ శ్రీధర్ రజిత

జనగామ రూరల్: పట్టణానికి చెందిన కాల్వ శ్రీధర్ రజిత కుమారుడు మోక్షిత్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి, టీం సభ్యులు బీమ్ రాజ్, బొట్ల సాయి, బింగి నర్సింహులు, లఖాన్ సింగ్, కొత్త పల్లి సుధాకర్, పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



పాలకుర్తి: గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వర పీడితులను గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అలాగే సర్వే పూర్తి అయిన వెంటనే రిపోర్టును ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తామని వారు చెప్పారు.

బీఆర్‌ఎస్‌కు అశోక్‌నాయక్ రాజీనామా

జఫర్‌గఢ్: మండలంలోని మగ్దుంతండా శివారు చిన్నతండాకు చెందిన వాంకుడోత్ అశోక్‌నాయక్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గత కొంతకాలం నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేశానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో పాటు రేవంత్‌రెడ్డి కొత్త ప్రభుత్వంలో తాను భాగస్వామిని అయ్యేందుకు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు నిర్వహించడంతో పాటు తన భార్య జెడ్పీటీసీ సభ్యురాలిగా పోటీ చేసి ఓటమి చెందిందని చెప్పారు మళ్లీ కాంగ్రెస్‌లోనే తాను కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



బచ్చన్నపేట నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



చిల్పూరు: కృష్ణాజీగూడెం నుంచి వెళ్తున్న నాయకులు

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి జనగామ పట్టణంతో పాటు పలు మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తరలివెళ్తున్న వాహనాల ర్యాలీని నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, మిద్దెపాక స్టాలిన్, ఉడుగుల నర్సింగ రావు, మశ్లిగారి యాదగిరి, ఆర్.సుధాకర్, సుంకరి శేఖర్, నాగిల్ల శ్రీధర్, కొయ్యడ శ్రీను, నల్లగోని బాల కిషన్‌గౌడ్, మహాత్మాచారి, అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, గిరగాని కుమార స్వామి, గుగ్గిళ్ల ఆదినారాయణ, కోళ్ల రవిగౌడ్, మేకల నరేందర్, గాదె మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జనగామ: 13వ వార్డులో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మేడ శ్రీనివాస్



రఘునాథపల్లి నుంచి..



జఫర్‌గఢ్ నుంచి..

సంపత్‌రెడ్డి సేవలు మరువలేనివి



చిల్పూరు: ఇటీవల మృతి చెందిన జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కొండాపూర్ గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని సర్పంచ్ లొడెం రజితరవీందర్ అన్నారు. కొండాపూర్‌లో గురువారం గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీణ్ అధ్యక్షతన సంపత్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అనంతరం సంపత్‌రెడ్డి ఫ్లెక్సీకి నివాళులర్పించారు. ఎంపీటీసీ అయిలమ్మఎల్లయ్య, ఉప సర్పంచ్ కొడ సంపత్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.